# ఎఫ్‌డీఐలు తిరోగమనం

## 2024-25లో భారీగా తగ్గిన విదేశీ పెట్టుబడులు



న్యూఢిల్లీ, మే 24: విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ఆకట్టుకోవడంలో నరేంద్ర మోదీ సర్కార్ విఫలమవుతున్నది. గడిచిన కొన్నేండ్లుగా తగ్గుముఖం పట్టిన ఎఫ్‌డీఐలు..గడిచిన ఆర్థిక సంవత్సరంలోనూ భారీగా పడిపోయాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో భారత్‌లోకి కేవలం 353 మిలియన్ డాలర్ల విదేశీ పెట్టుబడులు వచ్చాయి. ఈ విషయాన్ని రిజర్వు బ్యాంక్ తాజాగా వెల్లడించింది. అంతక్రితం ఏడాది వచ్చిన 10 బిలియన్ డాలర్ల ఎఫ్‌డీఐలతో పోలిస్తే 96.5 శాతం తగ్గాయని పేర్కొంది. అంతక్రితం ఏడాది రికార్డు స్థాయి ఎఫ్‌డీఐలను ఆకర్షించిన భారత్.. ఆ మరుసటి ఏడాదే భారీగా పడిపోవడం విశేషం. కానీ, విదేశాల్లో పెట్టుబడులు పెట్టే దేశీయ కంపెనీలు భారీగా పెరుగుతున్నాయి. గడిచిన ఆర్థిక సంవత్సరంలో ఆయా సంస్థలు 29 బిలియన్ డాలర్ల మేర పెట్టుబడులు పెట్టాయి. అంతక్రితం ఏడాది పెట్టిన 17 బిలియన్ డాలర్ల కంటే ఇది 50 శాతానికి పైగా అధికం.

### విదేశీ పెట్టుబడిదారులు దూరం

ప్రపంచ దేశాల్లో భారత్ అత్యధిక వృద్ధిని నమోదు చేసుకుంటున్నప్పటికీ విదేశీ పెట్టుబడిదారులు పెద్దగా ఆసక్తిని కనబర్చడం లేదు. దీంతో గడిచిన కొన్నేండ్లుగా భారీగా పెట్టుబడులు పెట్టిన విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు..గతేడాది పెట్టుబడులు పెట్టడానికి వెనుకంజవేశారు. కానీ, దేశీయ ఈక్విటీ మార్కెట్లపై మాత్రం ఎనలేని ప్రేమను కురిపిస్తున్నారు. ఇతర దేశాల ఈక్విటీ మార్కెట్లతో పోలిస్తే సెన్సెక్స్, నిఫ్టీలు రెండంకెల స్థాయిలో రాబడిని పంచడమే ఇందుకు కారణం. మొత్తంగా గడిచిన ఆర్థిక సంవత్సరంలో ఎఫ్‌డీఐలు 13.7 శాతం పెరిగి 81 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. వీటిలో సగం ఐపీవోకి వచ్చిన సంస్థల్లో ఇన్వెస్ట్ చేశారు. 2023-24 సంవత్సరంలో విదేశీ పెట్టుబడిదారులు 49 బిలియన్ డాలర్ల పెట్టుబడులను తరలించుకుపోయారు. ప్రైవేట్ ఈక్విటీ, వెంచర్ క్యాపిటల్ ఫండ్స్, ఆల్ఫా వేవ్ గ్లోబల్ అండ్ పార్టనర్స్ గ్రూపు, స్విగ్గీ, విశాల్ మెగా మార్ట్‌లోకి వచ్చిన ఎఫ్‌డీఐలు అత్యధికంగా వచ్చాయి. అలాగే అల్టార్‌నెటివ్ క్యాపిటల్ అసోసియేషన్(ఐవీసీఏ), ఈవై, పీఈ/వీసీ ల నుంచి 26.7 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఉపసంహరించుకున్నారు. హ్యూందాయ్ మోటర్ ఇండియా తన వాటాను 100 శాతం నుంచి 82.5 శాతానికి తగ్గించుకోవడంతో రూ.27,870 కోట్ల నిధులు సమకూరగా, అలాగే స్విగ్గీ కూడా 2 బిలియన్ డాలర్ల నిధులను సేకరించింది. వీటితోపాటు టెలికం దిగ్గజం సింగ్‌టెల్..భారతీ ఎయిర్‌టెల్‌లో తనకున్న వాటాను మొత్తం విక్రయించగా, అలాగే బ్రిటిష్ అమెరికన్ టొబాకో(బీఏటీ)..ఐటీసీలో ఉన్న తన మొత్తం వాటాను విక్రయించింది. గతేడాది సెప్టెంబర్ నెలలో దేశీయ ఈక్విటీ మార్కెట్లు రాకెట్ వేగంతో దూసుకుపోవడంతో ఒక్కో విదేశీ కంపెనీలు..దేశీయ పెట్టుబడులను ఉపసంహరించుకున్నాయి.

### తయారీ రంగానికి బ్రేకులు

విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ఆకట్టుకోవడంలో తయారీ రంగంతోపాటు ఆర్థిక సేవలు, ఎనర్జీ, కమ్యూనికేషన్ రంగాలు విఫలమయ్యాయి. గత కొన్నేండ్లుగా ఈ రంగాలు ఆశాజనక పనితీరు కనబర్చలేకపోవడంతో విదేశీ పెట్టుబడిదారులు వీటివైపు కన్నెత్తి కూడా చూడలేదు. తయారీ, ఆర్థిక సేవలు, ఎనర్జీ, టెలికం రంగాల్లోకి ఎఫ్‌డీఐలు భారీగా తగ్గడం మొత్తం ఎఫ్‌డీఐలపై ప్రతికూల ప్రభావం చూపాయని సెంట్రల్ బ్యాంక్ తాజా నివేదికలో వెల్లడించింది.

---




# గిన్నిస్‌బుక్‌లో ఎల్ఐసీ

## 24 గంటల్లో 5.88 లక్షల పాలసీల విక్రయంతో రికార్డు

న్యూఢిల్లీ, మే 24: ప్రభుత్వరంగ బీమా దిగ్గజం ఎల్ఐసీ మరో అరుదైన ఘనతను సాధించింది. కేవలం 24 గంటల్లో రికార్డు స్థాయిలో బీమా పాలసీలను విక్రయించి గిన్నిస్ వరల్డ్ రికార్డును సొంతం చేసుకున్నది. ఈ ఏడాది జనవరి 20న ఈ అరుదైన ఘనతను సాధించినట్లు కంపెనీ ఒక ప్రకటనలో పేర్కొంది. విస్తృతమైన ఏజెన్సీ నెట్‌వర్క్ కలిగిన తమ పనితీరుకు గుర్తుగా గిన్నిస్ వరల్డ్ రికార్డు గుర్తించిందని పేర్కొంది. ఈ ఏడాది జనవరి 20న కంపెనీకి చెందిన 4,52,839 ఏజెంట్లు ఒక్కో పాలసీ చొప్పున 5,88,107 జీవిత బీమా పాలసీలను విక్రయించారు. బీమా చరిత్రలో 24 గంటల వ్యవధిలో ఈ స్థాయిలో పాలసీలను విక్రయించడం ఇదే తొలిసారని తెలిపింది. ఎల్ఐసీ వ్యవస్థాపక దినోత్సవం రోజైన జనవరి 20న 'మ్యాడ్ మిలియన్ డే'ను పురస్కరించుకొని ఒక్కో ఏజెంట్ కనీసం ఒక్కో పాలసీ అయిన పూర్తి చేయాలన్న కంపెనీ ఎండీ, సీఈవో సిద్దార్థ మొహంతీ విజ్ఞప్తి మేరకు ఈ అరుదైన ఫీట్‌ను సాధించినట్లు వెల్లడించారు. ఈ అరుదైన మైలురాయిని సాధించడం పట్ల ఆయన సంతోషం వ్యక్తంచేశారు.




# సింగిల్ చార్జింగ్‌తో 835 కిలోమీటర్లు

## ఈవీను విడుదల చేసిన చైనా సంస్థ షియోమీ

న్యూఢిల్లీ, మే 24: చైనాకు చెందిన ఎలక్ట్రిక్ కార్ల తయారీ సంస్థ షియోమీ మరో అడుగుముందుకేసింది. ఇప్పటికే తన తొలి మాడల్‌కు విశేష స్పందన లభిస్తున్న ప్రస్తుత తరుణంలో మరో మాడల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. వైయూ7 పేరుతో విడుదల చేసిన ఈ మాడల్ సింగిల్ చార్జింగ్‌తో గరిష్ఠంగా 835 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. టెస్లాకు చెందిన వై మాడల్‌కు పోటీగా ఈ కారును ప్రవేశపెట్టింది. ఇప్పటికే విడుదల చేసిన ఎస్‌యూ7 సెడాన్ 2.58 లక్షల యూనిట్లు అమ్ముడయ్యాయి.

**ఈ నూతన కారు ప్రత్యేకతలు..**

- సింగిల్ చార్జింగ్‌తో 835 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. అత్యధిక మైలేజీ ఇచ్చే మూడో మాడల్ ఇదే కావడం విశేషం.
- 96.3 కిలోవాట్ల ఎల్ఎఫ్‌పీ బ్యాటరీతో తీర్చిదిద్దింది. కేవలం 3.23 సెకండ్లలో 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్న ఈ మాడల్ గంటకు 253 కిలోమీటర్లు ప్రయాణించనున్నది.
- ప్రో మాడల్ సింగిల్ చార్జింగ్‌తో 770 కిలోమీటర్లు ప్రయాణించనున్నది.

---

## ఇక బడుగు వ్యాపారుల పైనా జీఎస్టీ!

న్యూఢిల్లీ, మే 24: మధ్య స్థాయి నుంచి భారీ స్థాయిలో వ్యాపారం చేసే వారిని లక్ష్యంగా చేసుకుని ఎడాపెడా జీఎస్టీ భారాన్ని విధించిన కేంద్రం ఇప్పుడు బడుగు, బలహీన వర్గాలను కూడా పన్ను పరిధిలోకి తేవాలని తహతహలాడుతున్నది. అనధికారిక ఆర్థిక కార్యకలాపాలను నియంత్రించి వారిని కూడా జీఎస్టీ పరిధిలోకి తెచ్చేందుకు కేంద్రం జాతీయ స్థాయిలో ప్రచారం నిర్వహించనుంది. ఈ మేరకు కేంద్ర పరోక్ష పన్నులు, కస్టమ్స్ బోర్డు (సీబీఐసీ) తన ఫీల్డ్ అధికారుల ద్వారా ఆ దిశగా చర్యలు చేపట్టేందుకు కసరత్తులు ప్రారంభించింది. నమోదు కాని సంస్థల ద్వారా పన్ను ఎగవేతలను నిరోధించి నగదు ఆధారిత, లెక్కల్లో చూపని లావాదేవీలపై ఆధారపడటాన్ని తగ్గించాలని ధ్యేయంగా నిర్ణయించుకుంది. ఇదే కనుక అమలైతే ఇక నుంచి బజ్జీల బండి వాళ్లు, బండ్లపై అరటి పండ్లు అమ్ముకునే వారితో పాటు రోడ్డు పక్కన ఉండే మెకానిక్‌లు, సైకిల్ షాపు వాళ్లు, టైర్లకు గాలి కొట్టేవారు.. ఇలా ఒకరేమిటి రోడ్డుపక్కన తోటకూర అమ్ముకునే తాత నుంచి, రేగు పండ్లు అమ్ముకునే మామ్మ వరకు అందరిపై జీఎస్టీని ఎడాపెడా విధించడానికి కేంద్రం చకచకా పావులు కదుపుతున్నది.

## డీ-మెర్జింగ్‌తో వాటాదారులకు లాభమే

టాటా మోటర్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్



నూఢిల్లీ, మే 24: టాటా మోటర్స్‌ను విడగొట్టే ప్రతిపాదనతో దీర్ఘకాలికంగా వాటాదారులకు లాభం చేకూరనున్నదని కంపెనీ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ వ్యాఖ్యానించారు. కంపెనీ 80వ వాటాదారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. టాటా మోటర్స్‌ను రెండు సంస్థలుగా విడగొట్టి కమర్షియల్ వాహనాలు, ప్యాసింజర్ వాహన విభాగాలుగా విడగొట్టి స్టాక్ మార్కెట్లో లిస్ట్ చేయాలనుకుంటున్నట్టు చెప్పారు. ఈ ప్రతిపాదనకు ఇప్పటికే వాటాదారులు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. దీంతో ఈ ఏడాది రెండో అర్ధభాగం నాటికి టాటా మోటర్స్ రెండు సంస్థలుగా మారబోతున్నది. వ్యాపార వ్యూహాత్మకంలో భాగంగా పలు సంస్థలను విడగొట్టాలని నిర్ణయించినట్టు, దీంతో గ్రూపు ఆర్థికంగా బలోపేతం కావడంతోపాటు వాటాదారులకు లబ్ధిచేకూరనున్నదని ఆయన వ్యాఖ్యానించారు.

## హైదరాబాద్‌లో యంత్రాల ఎగ్జిబిషన్

హైదరాబాద్, మే 24: దక్షిణాదిలో అతిపెద్ద బీ2బీ ఇండస్ట్రియల్ యంత్రాలు అండ్ ఇంజినీరింగ్ ఎగ్జిబిషన్‌కు మరోసారి హైదరాబాద్ వేదికైంది. నాలుగోసారి జరుగుతున్న ఈ ఎగ్జిబిషన్‌లో ఇంజినీరింగ్, మౌలిక రంగానికి సంబంధించిన అన్ని రకాల ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నారు. మెషిన్ టూల్స్, ఆటోమేషన్, రోబోటిక్స్, వెల్డింగ్, ఎలక్ట్రికల్, ఇండస్ట్రియల్, ఇంజినీరింగ్ ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నారు.


## బ్రోక్‌ఫిల్డ్ భారీ పెట్టుబడులు

న్యూఢిల్లీ, మే 24: అంతర్జాతీయ పెట్టుబడుల సంస్థ బ్రోక్‌ఫిల్డ్..భారత్‌లో భారీ పెట్టుబడులకు సిద్ధమవుతున్నది. వచ్చే ఐదేండ్లకాలంలో తన ఆస్తులను 100 బిలియన్ డాలర్ల స్థాయిలో పెంచుకోవడానికి భారీగా ఇన్వెస్ట్ చేయాలనుకుంటున్నది. ప్రస్తుతం సంస్థ భారత్‌లో 30 బిలియన్ డాలర్ల విలువైన ఆస్తులు కలిగివున్నది. మౌలిక సదుపాయాలు, రియల్ ఎస్టేట్, రెన్యూవబుల్ ఎనర్జీ, ప్రైవేట్ ఈక్విటీల్లో తన అసెట్స్ అండర్ మేనేజ్‌మెంట్ కలిగివున్నది.

# ఎఫ్ఐఐల 5 వేల కోట్లు వెనక్కి

## గతవారంలో తరలించుకుపోయిన విదేశీ ఇన్వెస్టర్లు

న్యూఢిల్లీ, మే 24: దేశీయ ఈక్విటీ మార్కెట్ల నుంచి విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారీ స్థాయిలో నిధులను వెనక్కితీసుకుంటున్నారు. ఇదే క్రమంలో ప్రస్తుత వారంలోనూ రూ.5 వేల కోట్ల పెట్టుబడులను తరలించుకుపోయారు. అంతర్జాతీయ స్టాక్ మార్కెట్లు తీవ్ర హెచ్చుతగ్గుదలకు లోనుకావడంతో ఈ నెల 19 నుంచి 23 మధ్యకాలంలో ఈక్విటీల నుంచి రూ.4,784.32 కోట్ల పెట్టుబడులను ఉపసంహరించుకున్నారు. దీంతో ఎఫ్ఐఐల పెట్టుబడులు రూ.18,620 కోట్ల నుంచి రూ.13,835 కోట్లకు తగ్గాయని నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్ తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. గత ఐదు సెషన్లలో విదేశీ పెట్టుబడిదారులు అత్యధికంగా తమ పెట్టుబడులను తరలించుకుపోయారు. తీవ్ర ఊగిసలాటల మధ్య కొనసాగిన సూచీలు గతవారంలో ఒకరోజు 10 వేల కోట్ల రూపాయల పెట్టుబడులను వెనక్కితీసుకున్నారు. అయినప్పటికీ ప్రస్తుత సంవత్సరంలో దేశీయ ఈక్విటీ మార్కెట్లోకి ఎఫ్ఐఐలు రూ.98,516 కోట్ల మేర పెట్టుబడులు పెట్టారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్..యూరోపియన్ దేశాలపై ప్రతీకార సుంకాలను 50 శాతం విధిస్తూ తీసుకున్న నిర్ణయం అంతర్జాతీయంగా పెట్టుబడిదారుల్లో ఆందోళన నెలకొన్నది. ఫలితంగా ఈక్విటీల నుంచి తమ పెట్టుబడులను సురక్షితమైన అతి విలువైన లోహాల వైపు మళ్లించారు. దేశీయ ఆర్థిక మూలాలపై ఎలాంటి ప్రభావం లేదని, కేవలం అంతర్జాతీయంగా జరుగుతున్న పరిణామాల వల్లనే ఎఫ్ఐఐలు వెనక్కి తీసుకుంటున్నారని దలాల్‌స్ట్రీట్ వర్గాలు వెల్లడించాయి. ఏప్రిల్ నెలలో ఎఫ్ఐఐలు రూ.4,223 కోట్ల పెట్టుబడులు పెట్టగా, మార్చి నెలలో రూ.3,973 కోట్ల విలువైన స్టాక్స్‌ను కొనుగోలు చేశారు. కానీ, జనవరి నెలలో రూ.78 వేల కోట్లు, ఫిబ్రవరి నెలలో రూ.34,574 కోట్ల విలువైన షేర్లను విక్రయించారు.



## ఎన్‌టీపీసీ రూ.33.50 డివిడెండ్

న్యూఢిల్లీ, మే 24: ప్రభుత్వరంగ విద్యుత్ ఉత్పత్తి సంస్థ ఎన్‌టీపీసీ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. మార్చితో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థ రూ.7,897.14 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.6,490.05 కోట్ల లాభంతో పోలిస్తే భారీగా వృద్ధిని నమోదు చేసుకున్నది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం రూ.48,816.55 కోట్ల నుంచి రూ.51,085 కోట్లకు ఎగబాకింది. దీంట్లో విద్యుత్ ఉత్పత్తి ద్వారా సంస్థకు రూ.49,352 కోట్ల ఆదాయం సమకూరింది. గడిచిన ఆర్థిక సంవత్సరం మొత్తానికి రూ.1,90,862.45 కోట్ల ఆదాయంపై రూ.23,953.15 కోట్ల నికర లాభాన్ని గడించింది. మరోవైపు, 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.10 ముఖ విలువ కలిగిన ప్రతిషేరుకు రూ.33.50 తుది డివిడెండ్‌ను బోర్డు ప్రకటించింది. గతేడాది కొత్తగా 3,972మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అందుబాటులోకి రావడంతో మొత్తం కెపాసిటీ 79,930 మెగావాట్లకు చేరుకున్నది.

---

## సారంగపూర్ హనుమాన్ ఆలయంలో దుకాణాల నిర్వహణకు వేలం

సుభాష్‌నగర్, మే 24 : సారంగపూర్ హనుమాన్ మందిరంలో శనివారం వివిధ అమ్మకాలకు బహిరంగ వేలం నిర్వహించారు. ఎండోమెంట్ పర్యవేక్షకులు కమల ఆధ్వర్యంలో శ్రావణమాసం నెల రోజులు భక్తుల సౌకర్యార్థం వాహన పార్కింగ్, రెండు సంవత్సరాల కాలపరిమితితో పూజా సామగ్రి, కొబ్బరికాయలు విక్రయించేందుకు వేలం నిర్వహించగా వాహన పార్కింగ్‌కు చల్లా శ్రీనివాస్ రూ.76 వేలకు, కొబ్బరికాయలు విక్రయించేందుకు పూజా సామగ్రి నిర్వహణకు బి. నర్సింహులు రూ. 6 లక్షల 54 వేలకు దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో నాయకం రాములు, జూనియర్ అసిస్టెంట్ ప్రశాంత్‌కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఘనంగా అహల్యాబాయి జయంతి



అహల్యాబాయి జయంతి వేడుకల్లో పాల్గొన్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, నాయకులు

సుభాష్‌నగర్, మే 24 : మహిళలకు స్ఫూర్తి ప్రదాత మహారాణి అహల్యాబాయి హోల్కర్ అని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. జిల్లా కేంద్రంలోని నీలకంఠేశ్వరాలయంలో అహల్యాబాయి జయంతిని శనివారం నిర్వహించారు. అహల్యాబాయి మహిళలకు చేసిన సేవలను గుర్తు చేశారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కన్వీనర్ పాతన్‌కర్ లక్ష్మీనారాయణ, పాలెం రణదీశ్, రొట్టె సురేశ్‌శర్మ, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

## అటవీ భూమిని చదును చేస్తే కఠిన చర్యలు



సీజ్ చేసిన ట్రాక్టర్‌ను చూపుతున్న అటవీ శాఖ అధికారులు

సిరికొండ, మే 24 : అటవీ భూమిని అక్రమంగా చదును చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఆర్వో గంగారాం తెలిపారు. శనివారం మండలంలోని తాటిపల్లి బీట్ పరిధిలోని కంపార్టుమెంట్ నెంబర్ 56లో అక్రమంగా ట్రాక్టర్‌తో చదును చేస్తున్న జినిగ్యాలకు చెందిన సవాయిలాల్ ట్రాక్టర్‌ని సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌లో ఉంచామని తెలిపారు. అక్రమంగా అటవీ భూమిని చదును చేసినా, చెట్లు నరికినా వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

# గ్రామపాలన అధికారుల రాతపరీక్షకు ఏర్పాట్లు పూర్తి

## నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు



వీసీ పాల్గొన్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, అధికారులు

కంఠేశ్వర్, మే 24 : జిల్లాలో గ్రామ పాలన అధికారుల రాతపరీక్షను ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంత తెలిపారు. ఆదివారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహించనున్న రాతపరీక్షకు జిల్లాలో 331 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని పేర్కొన్నారు. గ్రామపాలన అధికారుల రాత పరీక్ష నిర్వహణ ఏర్పాట్లపై సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ శనివారం హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎలాంటి లోటుపాట్లకు, గందరగోళానికి తావులేకుండా ప్రశాంత వాతావరణంలో సజావుగా రాతపరీక్ష నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా పరీక్ష నిర్వహణ కోసం జిల్లాలో చేపట్టిన ఏర్పాట్లపై కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు ఆయన దృష్టికి తెచ్చారు. 331 మంది అభ్యర్థులు హాజరు కానున్న నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఒక్కో గదిలో 32 మంది అభ్యర్థుల చొప్పున మొత్తం 11 గదుల్లో పరీక్ష నిర్వహించేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టామని వివరించారు. పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు చేస్తూ పోలీసు బందోబస్తుకు ఆదేశించామన్నారు. ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు ఉండేలా చర్యలు తీసుకున్నామని పరీక్ష సమయానికనుగుణంగా ప్రత్యేక బస్సులు నడిపేలా ఆర్టీసీ అధికారులకు సూచనలు చేశామని తెలిపారు. పరీక్షా కేంద్రంలో తాగు నీటి వసతి, సరిపడా ఫర్నిచర్ అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. ఎలాంటి మాల్ ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా ఇన్విజిలేటర్లతో పాటు ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్‌లను నియమించినట్లు తెలిపారు. నిర్ణీత సమయానికి ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని, ఆలస్యంగా వచ్చే వారిని లోనికి అనుమతించబోమని అభ్యర్థులకు ఇప్పటికే సూచించామని పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, అదనపు డీసీపీ బస్వారెడ్డి, ఆర్డీవో రాజేంద్రకుమార్, జీజీ కళాశాల ప్రిన్సిపాల్ రామ్మోహన్, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్, తహసీల్దార్ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

### పరీక్షా కేంద్రం వద్ద 163 సెక్షన్ అమలు

వినాయక్‌నగర్, మే 24: నిజామాబాద్ జిల్లా కేంద్రంలో నేడు నిర్వహించనున్న గ్రామ పాలన అధికారుల పరీక్ష సందర్భంగా కేంద్రాల వద్ద అండర్ సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ అమలులో ఉంటుందని సీపీ సాయి చైతన్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక గిరిరాజ్ ప్రభుత్వ కళాశాలలో పరీక్షా కేంద్రం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పరీక్షా కేంద్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తుగా నిబంధనలు విధించినట్లు తెలిపారు. బీఎన్ఎస్ఎస్ 163 సెక్షన్ అమలులో ఉన్నందున పరీక్షా కేంద్రానికి పరిసర ప్రాంతాల్లో ఇద్దరు లేదా అంతకన్నా ఎక్కువ మంది వ్యక్తులు గుమిగూడరాదని సూచించారు. పరీక్షా కేంద్రం ప్రాంతంలో అన్ని జిరాక్స్ సెంటర్లు ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మూసి ఉంచాలన్నారు.

# ఫుట్‌పాత్‌పై వ్యాపారాలు చేస్తే చర్యలు తప్పవు

## వ్యాపారులకు ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ హెచ్చరిక



సమావేశంలో మాట్లాడుతున్న ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ

వినాయకనగర్, మే 24: నగరంలోని పలు ప్రాంతాల్లో వ్యాపారులు, తోపుడు బండ్లవారు ఇష్టానుసారంగా రోడ్లను ఆక్రమించడంతోపాటు రోడ్డుపైనే పార్కింగ్ చేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ పేర్కొన్నారు. సీపీ సాయి చైతన్య ఆదేశాల మేరకు శనివారం ఆయన ట్రాఫిక్ సీఐ ప్రసాద్‌తో కలిసి దేవీరోడ్డు, గంజ్ ప్రాంతంలోని దుకాణాల యజమానులు, తోపుడు బండ్ల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఏసీపీ మాట్లాడుతూ.. ప్రతి దుకాణాదారుడు తమ షాపులోనే వ్యాపారం చేసుకోవాలని సూచించారు. షాపు ముందర ఫుట్‌పాత్‌ను ఆక్రమించరాదని, వాహనాలను రోడ్డుపై పార్కింగ్ చేయకూడదని సూచించారు. తోపుడు బండ్లను సైతం రోడ్డు పై ఇష్టానుసారంగా నిలుపవద్దని సూచించారు. నిబంధనలు పాటించని వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## మొక్కలు నాటిన ఫారెస్టు అధికారులు

మోస్రా (చందూర్) , మే 24 : మోస్రా మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం పారెస్టు అధికారులు, గ్రామస్తులు మెక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కలు నాటి సంరక్షిస్తే వాతావరణంలో జరిగే అనేక కాలుష్యాలను నిర్మూలించవచ్చని, భావితరాలకు మంచి వాతావరణాన్ని అందించవచ్చని అన్నారు. కార్యక్రమంలో ఫారెస్టు రేంజ్ ఆఫీసర్, కోటేశ్ యాదవ్, బీట్ ఆఫీసర్ హుస్సేన్, పాఠశాల హెచ్‌ఎం బాలాజీ, గ్రామస్తులు పాల్గొన్నారు.



మోస్రాలో మొక్కలు నాటుతున్న ఫారెస్టు అధికారులు

## జీవితంపై విరక్తి చెంది ఒకరి ఆత్మహత్య

ఆర్మూర్‌టౌన్, మే 24:ఆర్మూర్ మండలంలోని ఖానాపూర్ గ్రామంలో జీవితంపై విరక్తి చెంది ఒడ్డెపు లక్ష్మీనర్సయ్య(40) ఆత్మహత్య చేసుకున్నాడు. ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. ఖానాపూర్ గ్రామానికి చెందిన లక్ష్మీ నర్సయ్యతో తన భార్య రెండేండ్ల క్రితం గొడవపడి కొడుకు, కూతురుతో కలిసి తల్లిగారింటికి వెళ్లింది. భార్య తిరిగి రాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది లక్ష్మీ నర్సయ్య ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్‌హెచ్‌వో తెలిపారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## విద్యుత్ షాక్‌తో వృద్ధురాలి మృతి



దాస పద్మ (ఫైల్)

ముప్కాల్, మే 24 : మండలంలోని వేంపల్లి గ్రామానికి చెందిన దాస పద్మ (50) శనివారం విద్యుత్ షాక్‌తో మృతిచెందినట్లు ఎస్సై రజనీకాంత్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం రాత్రి ఇంట్లో బల్బును ఆన్ చేసే క్రమంలో విద్యుత్ షాక్ తగిలి మంటలు అంటుకున్నాయని, బయటికి వచ్చి కేక లు వేయడంతో గ్రామస్తులు మంటలు ఆర్పి దవాఖానకు తరలించారు. కాలిన గాయాలతో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందింది. మృతురాలి కూతురు లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

## పశువుల కోసం వెళ్లి ప్రాణాలు కోల్పోయి..

నాగిరెడ్డిపేట, మే 24 : పశువులను తోలుకు రావడానికి వెళ్లి ప్రమాదవశాత్తు మంజీరా నదిలో నీట మునిగి భార్య, కుమారుడి కండ్ల ముందే.. రైతు అకాల మరణం పొందిన ఘటన నాగిరెడ్డిపేట మండలం చీనూర్‌లో శనివారం చోటు చేసుకున్నది. ఎస్సై మల్లారెడ్డి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చీనూర్ గ్రామానికి చెందిన ఎనగండ్ల మొగులయ్య (43) వ్యవసాయంతోపాటు పశువులను సాకుతూ.. కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కాగా శుక్రవారం మొగులయ్య పెద్ద కుమారుడు రాజు పశువులను మేపేందుకు మంజీరానది సమీపానికి వెళ్లాడు. మధ్యాహ్నం సమయంలో పశువులు వాగు దాటి అవతలి వైపునకు వెళ్లాయి. తండ్రి మొగులయ్యకు ఫోన్ చేయడంతో.. సాయంత్రం సమయంలో భార్య లక్ష్మిని వెంట తీసుకొని వెళ్లాడు. భార్య, కొడుకు నది ఒడ్డున ఉండగా.. నది అవతలి వైపున ఉన్న పశువులను తోలుకు రావడానికి ఈత కొడుతూ వెళ్లాడు. నది మధ్యలోకి వెళ్లగానే ఊపిరాడక నీట మునిగి మృతి చెందాడు. శనివారం గజ ఈతగాళ్ల సహాయంతో.. నదిలో వెతకగా మధ్యాహ్నం సమయంలో శవాన్ని గుర్తించి బయటికి తీశారు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శవాన్ని పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు. నదిలో కొట్టుకుపోతున్న ఎంతో మందిని ప్రాణాలకు తెగించి కాపాడిన మొగులయ్య అందరూ చూస్తుండగానే కళ్లముందే చనిపోవడంతో.. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్య లక్ష్మితోపాటు తల్లి కమలమ్మ, కుమారులు రాజు, రాకేశ్ ఉన్నారు.

## ధూప దీప నైవేద్య పథకానికి 292 దరఖాస్తులు

సుభాష్‌నగర్, మే 24 : దేవాదాయశాఖ పరిధిలోని ఆలయాల్లో నిత్య ధూపదీప నైవేద్య పథకానికి దరఖాస్తుల స్వీకరణ గడువు శనివారంతో ముగిసింది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా మొత్తం 292 దరఖాస్తులు వచ్చినట్లు దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ విజయ రామారావు వెల్లడించారు. దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి రాష్ట్ర కార్యాలయానికి పంపుతామని పేర్కొన్నారు. ఎంపికైన ఆలయాలకు ప్రభుత్వం ప్రతినెలా అర్చకులకు రూ. 10 వేలు అందజేస్తుందని, ఇందులో పూజా సామగ్రి కోసం రూ. 4 వేలు, అర్చకుడికి రూ.6 వేల గౌరవ వేతనం ఉంటుందని పేర్కొన్నారు.

## అనాథల కోసం కాశీలో కర్మకాండ



కర్మకాండ నిర్వహిస్తున్న ఇందూరు యువత స్వచ్ఛంద ప్రతినిధులు

సుభాష్‌నగర్, మే 24 : మానవత్వమే నిజమైన దైవత్వంగా భావిస్తూ ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ వివిధ కార్యక్రమాలు చేపడుతున్నది. 133 మంది అనాథల ఆత్మశాంతి కోసం కాశీలోని మణికర్ణిక ఘాట్ వద్ద శనివారం కర్మకాండ నిర్వహించారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మద్దుకూరి సాయిబాబు మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలో 2014 నుంచి ఇప్పటివరకు సంస్థ ఆధ్వర్యంలో అనాథలకు అంతిమ సంస్కారాలు నిర్వహించామని, వారి ఆత్మ శాంతి కోసం ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో సేవా సంస్థ ప్రతినిధులు ఐలేటి సంతోష్, ఇందూరు శేఖర్, విఘ్నేశ్ తదితరులు పాల్గొన్నారు.